# ఉగ్రతాంబూలం

"ఇటు, ఇటు !" అని పౌరాణిక నాటక ఫక్కీలో దారిచూపెట్టేరు ఇద్దరు కుర్రాళ్ళు. జారిపోతున్న కండువాని సవరించుకుంటూ వుంటే చేతిలో వున్న నిప్పుటోపీ క్రింద పడింది. అది తీసి అందిస్తూ ఓ కుర్రాడు చెయ్యికాలినంత హడావిడి చేసి నా కాళ్ళ కడ్డంపడ్డాడు. నేను పడబోయి నిలదొక్కుకున్నాను. నిప్పుటోపీని వదిలివేసి నన్ను పట్టుకున్నా రిద్దరూనూ. నిప్పుటోపీని నేనే తీసి చంకన పెట్టుకున్నాను. చెప్పమరిచాను; "నిప్పుటోపీ" నే నామధ్య రాసిన కావ్యం.

"ఆఁ, మరేమిటి సంగతులు ? ఆహ్వానించిన కవులు అందరూ వొచ్చేశారా ?" అని ఈ రోజు నేను కవితాగానం చేసే సభ నిర్వహించే వారి తరపున వొచ్చిన కుర్రాళ్ళ నడిగేను. వాళ్ళు, అమాయకంగా చూసి హరమతీ కాలమతీ లాగ తల లూపేరు. "ఒచ్చేసేరు సార్" అని ఏకకంఠంగా పలికేరు.

ఆటోరిక్షా మాట్లాడేరు. లాడ్జికి వెళ్ళాం. ఆటోరిక్షా డబ్బులు ఇవ్వబోయినట్టు నటించేను. కుర్రాళ్ళు సిగ్గుతో చచ్చిపోయేరు.

లాడ్జిలో దిగగానే రూంలో మంచం మీద ఫోంబెడ్డు మీద బాసింపట్టేసుకు కూచున్నాను. ఆ వూళ్ళో చదువుతున్న మా అబ్బాయి హర్షవర్ధనుడూ, వాడి ఫ్రెండు రమాపతిరావు నా భక్తులు వో అర డజను మందీ బిలబిలమంటూ వొచ్చేసేరు. వాళ్ళు రాగానే నేను ఆర్గనైజర్ల తరపు అబ్బాయిలని కేకేసి "మాకు కాఫీ టిఫిన్లు" అన్నాను. "ఆయ" అన్నాడు తెల్లగా వెర్రిమొహం వేసుకుచూసే అబ్బాయి. జేబులో చెయ్యిపెట్టి పది రూపాయల నోటు తీసేను.

"నేనిస్తాను నాన్నా!" అని మా అబ్బాయి వీరోచితంగా లేచేడు. "ఎవరిచ్చినా మీ డబ్బే కదా" అని ఎవరో జోకేశారు. "ఎందుకు లేండి సార్" అని వాలంటీరబ్బాయి అరిచెయ్యి చూపిస్తూ వెనక్కి నడచుకుంటూ వెళ్ళేడు.

అక్కణ్ణించీ లాడ్జి రూంలో కవితాగోష్ఠి సాగింది. మా అబ్బాయి ఫ్రెండు కవి. నా భక్తుల్లో కూడా యిద్దరు ముగ్గురు ఆముద్రిత నామ ధేయులైన కవులున్నారు. వాళ్ళందరూ బోలెడు "పోయిట్రీ" చదివేరు. నేనూ తక్కువ తినిపించలేదు. "అయిక్యత, అత్యయిక్యత" అని పేరుపెట్టి, ఎమర్జెన్సీని ప్రతీకగా చేసి డెబ్భయ్యార్వు పర్వాలు రాసేను. పంధొమ్మిది నెలలంటే పంధొమ్మిది నాలుగులు డెబ్భయ్యార్వు వారాలు కదా! వారపత్రిక ఎడిటరు రొకాయన నా దగ్గిర ఓసారి అయిదువందలు అప్పు పుచ్చుకుని ఇవ్వలేక బాధపడుతున్నాడు. ఆయన కిస్తే డెబ్భ య్యార్వు వారాలు వారానికో పర్వం చొప్పున అచ్చేస్తాడు.

నేను "అయిక్యత అత్యయిక్యత"లో పర్వాలు చదువుతూ వుంటే వొకరిద్దరు శ్రోతలు ఆవలించినట్టు, నిద్దర రాకండా వుండేం దుకు సిగరెట్లు కాల్చినట్టు తట్టింది. మధ్యాహ్నం కవి సమ్మేళనంలో దీని కేదో మందు వెయ్యాలి. లేకపోతే శ్రోతల్లో కొందరు నిద్రోడం; ఏమయ్యా కవిత్వం మీద అభిప్రాయం చెప్పమంటే నిద్రోయావు అని మనం పలకరించడం, "నిద్రమటుకు ఒక అభిప్రాయంకాదా?" అని వాడు చెప్పడం జరగొచ్చు.

మధ్యాహ్నం కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించడానికి ఆహ్వానించిన మేధావిగారు రాలేదు. ఆ పని కూడా నాకే తగిలింది. ఎనిమిది మంది పిల్లకవుల స్వీయకవిత అనంతరం నా కవిత చదవ మని, వాళ్ళ కవితల మీద నా అభిప్రాయం చెప్పమని నాకు విధి నిర్వ హణం వొప్పచెప్పేరు.

ప్రారంభంలో అధ్యక్షోపన్యాసాన్ని నా కవితతో ముడిపెట్టి నా కావ్యం "అయిక్యత - అత్యయిక్యత" లో రెండు పర్వాలు చదివేశాను. మా అబ్బాయి ఏర్పాటు చేసిన కరతాళదళంవారు వహవ్వా శభాష్ అనే కాక వన్స్‌మోర్‌లు కూడా కొట్టారు. కునికిపాట్లు పడుతున్న వాళ్ళంతా లేచి కూచున్నట్టయింది.

కవితాగానం చేసే పిల్లకవులు ఎనిమిది మందికీ మూడేసి నిమిషాల చొప్పున టైమ్ ఇచ్చేను. మొదటి కవికీ రెండో కవికీ మధ్య, రెండో కవికీ మూడో కవికీ మధ్య. అలా ప్రతి ఇద్దరి మధ్య నా కవిత పదేసి నిమిషాలు వినిపించేను. మొత్తం నా కవితాగానం ఎనభై నిమిషాలు! వాళ్ళది పాతిక నిమిషాలు, అనౌన్సుమెంట్లు కామెంట్లు పావుగంట, అలా రెండు గంటల సభనీ నడిపించేశాను. అధ్యక్షుడుగా వుండవలసినవారు రాకపోవడం మెరుగే అయింది.

నా ఆఖరు వాయిదా కవితాగానం అయిపోగానే జనం సంతోషం పట్టలేక హర్షాతి హర్షధ్వానాలు చేసేరు. అవన్నీ మా అబ్బాయి హర్షవర్ధనుడే చేయించే డనుకొని నేనూ హర్షించేను. ఎవరో నా దగ్గిరిసా వొచ్చి "నేటి కవుల్లో ఉగ్రతాంబూలం మీకే" అని షేక్హాం డిచ్చేడు.

"ఏదీ మరి, తాంబూలం?" అని "రెడీవిట్టు" వేశాను.

ఆయన తడుముకోకుండా జేబులోంచి కాగితంలో కట్టిన కిళ్ళీ తీసిచ్చాడు. "థాంక్యూ" అని కాగితం విప్పి కిళ్ళీ నోట్లో వేసుకుని నమిలేశాను. తల తిరిగింది. ఎక్కిళ్ళొచ్చాయి. పక్కకి తిరిగి చూశాను. పట్టుకోడం లేదతను. నవ్వుతున్నాడు.

తెలిసింది; అతను నాకిచ్చింది అగ్రతాంబూలం కాదు. ఉగ్ర తాంబూలం—కారాకిళ్ళీ.

(1-10-77)